# వేళకాని వేళ

(స్వాతి సపరివారపత్రిక, 14-9-2001)

"ఇదిగోండి క్యారేజి" భర్తకందించేందుకు వస్తున్న జ్యోతి పవిటకొంగు డైనింగ్ టేబుల్ ముందున్న కుర్చీకి తగులుకు కాస్త్రంగా తప్పుకుంది.

ఆమెనలా చూసిన దివాకర్.... "అసలే ట్రాన్స్పరెంట్ ఆపై జారినపైట మెరిసే పొట్ట నా నోట్లో లొట్ట... ఏం లాభం" అంటూ అందుకున్నాడు క్యారేజి.

మూతి బిగించి కళ్ళు పెద్దవి చేసింది జ్యోతి. ఆమెని మరింత ఉడికించాలని కన్నుగొట్టి, దగ్గరకు రమ్మన్నట్లు తల కొంటెగా ఊపేడు దివాకర్.

చూపుడువేలు గాల్లో ఆడించి లోపలి గదివైపు చూపించిందామె. 'గదిలో పిల్లలు చదువుకొంటున్నారు తమరు వెళ్ళిరండి' అని ఆమె ఆంతర్యం.

"పెద్దవాడికి పబ్లిక్. చిన్నవాడికి ప్రీ పబ్లిక్, చంటి దానికి స్లిప్పు....నాకెపుడో దొరికేది నీ లిప్పు" గొణుక్కుంటూ స్కూటర్ స్టాండ్ తీయబోయినవాడల్లా ఆగి వెనక్కు తిరిగేడు. పవిటకొంగు నడుంచుట్టూ తిప్పి బొడ్లో దోపుకుని నిలబడింది జ్యోతి.

"ఇలాగూ ఓకే" అంటూ ఆగాడు.

''మళ్ళీ ఏంటండీ" గాబరాగా అడిగింది

"అవునూ....మీ నాన్నకు ఉత్తరం రాస్తానన్నావ్....రాశావా" అని అడిగాడు.

"రాయలేదు. అయినా ఆ విషయం ఇప్పుడెందుకు గుర్తొచ్చింది మీకూ"

"నే ఒకటి రాశాలే....రెండూ కలిపి పోస్ట్ చేద్దామనీ" అన్నాడు ఎటో చూస్తూ.

"మీరు....మా నాన్నకి లెటర్ రాశారా?"

"మీ నాన్నకా? .... నేనా? .... ఉత్తరమా?" అన్నాడు నాటకీయంగా.

"మరెవరికీ....నాకా" అన్నది జ్యోతి.

"ముందు ముందు నీకు నాతో మాట్లాడ్డానికక్కూడా తీరికలేక పోతే అదీ తప్పదు" అన్నాడు విష్ఫారంగా.

సంతోషించాంలే బయల్దేరండి"

అతను వెనుతిరగబోతుండగా, "అవునింతకీ ఉత్తరం రాశా నంటున్నారు ఎవరికీ" అని అడిగింది జ్యోతి.

'సమరం గారికి' చెప్పేడు వినయంగా.

'ఎందుకట' అడిగింది జ్యోతి.

'కష్టం చెప్పుకుందామని'

'కష్టమా....సుఖ....'

'కాదు....కాదు....అదేం కాదు....కష్టమే'

'ఏదిటివ్వండి' అని చేయిచాపింది.

ఇవ్వక తప్పిందికాదతనికి. కాగితం మడతవిప్పి చదవసాగింది జ్యోతి.

'గౌరవనీయులైన డాక్టర్ గారికి....అనేకానేక నమస్కారములు చేసి దివాకర్ అనే ఈ దీనుడు రాసుకొను ఆవేదనా భరిత విన్నపము. దయచేసి నా ఉత్తరం ఆసాంతం చదివి తగిన సలహా ఇవ్వవలసినదిగా ప్రార్థన.

మీ సమాధానం పైనే నా సంసారం, నా జీవితం వెరసి నా సంసారజీవితం ఆధారపడియున్నది.

ఇక అసలు విషయానికివస్తే నా దాక చిక్కు సమస్య. నా భార్య చాలా చాలా అందంగా ఉంటుంది. ఎంత అందమంటే అది అపురూపమైనదేనటానికి నేను ఏ మాత్రం వెనుకాడను ఉత్తరం చదువుతున్న జ్యోతివంక ఓరగా చూసాడు దివాకర్.

ఆమె అతన్నేం పట్టించుకోకుండా ఉత్తరం చదవటంలో నిమగ్నమైపోయింది

'కొంపదీసి నా భార్య అందంగా వుండటమే నా చిక్కు సమస్యనుకున్నారేమో! అనేంకాదు. మా కొంపలో ముగ్గురు సంతానం ఉన్నారు. పెద్దవాడు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం వెలగబెడుతున్నాడు.

ఆయనకు కాలేజి ఒక్కొక్కనెల ఉదయం ఎనిమిది గంటల నుండి ఒంటిగంట వరకూ వుంటుంది ఒక్కొక్కసారి మధ్యాహ్నం ఉంటుంది ఎప్పుడెలా పెడతారో కాలేజీవారి అభీష్టం మేరకు జరుగుతుంది.

ఇకపోతే రెండో సంతానంగా పుట్టిన మా ఇంటి మాలక్ష్మి నా గారాలపట్టి, వరాలమూట ( పేరుకూడా వరలక్ష్మి మా అమ్మమ్మ గారి పేరు పెట్టుకున్నాంలేండి. క్షమించండి.... ఈ విషయం మీకు రాయటం అవసరం అనుకుంటాను. అయినా రాశాను కదా, రాసింది కొట్టెయ్యకూడదని నాకో సెంటిమెంట్.... కావున క్షంతవ్యుణ్ని) మళ్ళీ మొదటికి వస్తే....కాదు అసలు విషయానికి వస్తే (అదే నా చిక్కు సమస్య దగ్గిరకు - కొంచెం వివరంగా రాస్తున్నానంతే....క్షమించగలరు) అమెకు కూడా స్కూలు షిఫ్టు సిస్టమే టైములు భగవదేచ్ఛ.

ముచ్చటగా మూడోసారి పుట్టిన చంటోడు. (ఆలస్యంగా పుట్టినందున వాళ్ళమ్మకూ, అనగా నా భార్యకు వాడంటే అమిత

గారాబం, మితిమీరిన సంబరం) యు.కె.జి. చదువుతున్నాడు. వాడు వెళ్ళినపూట బడి ఉన్నట్టు, వెళ్ళనిపూట బడికి సెలవిచ్చినట్టు. అయ్యా ఈ రకమైన వాతావరణంలో పిల్లలున్నారన్న వంకతో నా భార్య నాకు అందీ అందకుండా ఉంటున్నది. ఆమె అందమేమో నన్ను పిచ్చివాడ్ని చేస్తున్నది

ఏమయితే అయిందంటూ పిల్లలముందు శృంగార పర్వం ప్రారంభించనూ లేక, అలాగని అపురూపమైన అందాలు కనువిందు చేస్తూండగా కళ్ళున్న అంధుడిలా చేతులు కట్టుకుని కూర్చోనూ లేక అర్థికశాస్త్రం అనుమతించకపోయినప్పటికీ ఆఫీసుకు దగ్గర్లో ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నాను. అనువైన సమయంలో, ఆయిదు నిమిషాల్లో ఆఫీసునుండి ఇంటికి చేరుకోగలను

పిల్లలంతా ఎవరిదారిన వాళ్ళు వెళ్ళినపుడు కనీసం ఓ గంటైనా వ్యవధి దొరికితే జ్యోతి అందాల్ని దోచేసుకుని, దోబూచులాడుకుని దొంగలా, పిల్లిలా పిల్లలొచ్చే వేళ్ళకు ఆఫీసుకు వెళ్ళిపోవచ్చనే ఆలోచనతో అయిదు వందలు అదనంగా అద్దె చెల్లించేందుకు సిద్ధపడి ఇల్లు అద్దెకు తీసుకున్నాను.

బిడ్డ వచ్చినవేళ, గొడ్డొచ్చినవేళ అన్నారేగానీ ఇల్లుమారినవేళ ఇల్లాలు అలిగినవేళ అని ఎవరూ అన్లేదు. ఐనా నేనంటున్నాను. ఎందుకంటే శృంగారభరితంగా సాగించాలనుకున్న జీవితం ఇలా శృంగభంగమయినందుకు. ఇల్లు మారిన మరుసటిరోజు నుంచీ అతిథి అభ్యాగతుల్తో మా ఇల్లు ఓ ధర్మసత్రంలా మారింది. మొదటిగా నా జననీజనకులు వచ్చి పక్షంరోజులుండి వెళ్ళారు.

వారు వెళ్ళిన మూడోరోజనుకుంటాను నా కాళ్ళుకడిగి కన్యాదానం చేసిన పూజ్యులు, గౌరవనీయులైన మా మామగారు, అత్తగారూ వచ్చి ఓ మూడువారాలు వెళ్ళబుచ్చి వెళ్ళారు. సరిగ్గా ఆరోజు

రాత్రే బొంబాయి నుంచి మా బావర్ది కుటుంబ సమేతంగా వచ్చి వాటంగా వారం గడిపి వెళ్ళాడు.

అక్కడితో పూర్తయితే అంతగా బాధపడేవాణ్ని కాదు కానీ, కంప్యూటర్ కోర్స్ చదువుకొనేందుకని మా రెండో మరదలు ఏకంగా ఏడాదిపాటు మా ఇంట్లో ఉండేందుకు వచ్చేసింది. ఇదివరకున్న ఇల్లు ఇరుకని ఎవరికివారే రావటానికి కాస్తంత ఇబ్బందిపడ్డారట.

ఇప్పుడు తీసుకున్న ఇల్లు అన్ని సౌకర్యాల్తో అనుకూలంగా వున్నది కావటాన వచ్చినవారు వెళ్ళేవెళ్ళకముందే మరొకరు రావటం జరుగుతున్నది.

డబ్బుకు డబ్బాపోయి. అనుకున్నపని అవకపోయేసరికి ఏం చేయాలో దిక్కుతోచక మీ యొక్క అమూల్యమయిన సలహాకోసం రాస్తున్నాను సమాధానం కోసం ఎదురుచూస్తున్నాను. "దివాకర్"

ఉత్తరం చదివిన జ్యోతి పగలబడి నవ్వసాగింది. ఆ సమయంలో భర్తవైపు చూసిన ఆమెకు అతని ముఖారవిందం మరింత నవ్వు తెప్పించింది.

అలా స్కూటర్‌హేండ్ పట్టుకుని గలగల నవ్వుతున్న జ్యోతిని అమాంతం కౌగిలించుకుని,కసిగా నలిపేయాలనిపించింది దివాకర్‌కు. ఆమెనవ్వుకు కారణం ఏమిటో తాను కూడా తెలుసుకోవాలని లోప ల్నుంచి కొడుకు, కూతురు బయటకు రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు దివాకర్ పిల్లల రాకతో వడివడిగా పైట సరి చేసుకుని వెనుదిరిగింది జ్యోతి

"ఏమైందమ్మా" అడిగేరు ఇద్దరు పిల్లలూ ఒకేసారి.

మీ డాడీ స్కూటర్‌స్టాండ్ తీయటానికి మూడుసార్లు ప్రయత్నం చేసినా కుదరకపోయేసరికి నవ్వాల్సొచ్చిందంతే" అన్నది జ్యోతి.

భార్యవంక గుర్రుగా చూస్తూ బయల్దేరాడు దివాకర్. పిల్లలు లోపలికెళ్ళటంతో గేటుదాకా వెళ్ళి భర్తతో అంది.

"ఈ భాగ్యానికి సమరంగారికి ఉత్తరం రాయాలా. బాగా అలోచించి రేపొక ప్లాను నేనే చెప్తాలే....దిగులు పడకండి" అని బుగ్గమీద గిల్లింది జ్యోతి.

"థాంక్స్ అని స్కూటరెక్కి వెళ్ళిపోయాడు దివాకర్.

గులాబిరంగుతో పల్చగావున్న జాకెట్. దాన్లోంచి స్పష్టంగా కనిపిస్తున్న వల్లబ్రా, తెల్లటి రంగుపైన గులాబి పువ్వుల డిజైన్‌వున్న కాటన్ చీరె, పొడపాటి వాలుజడలో రెండుమూరల మల్లెలు, అందంగా, అపురూపంగా కనిపిస్తున్న అర్థాంగిని అమాంతం కౌగలించుకుని, ముద్దుల్తో ముంచేయాలని మహా కోరికగా వుంది దివాకర్‌కు. కాని ఏం లాభం?

టీ.వీ చూస్తూ దగ్గర్లోనే కూర్చున్న మరదలుపిల్ల, అన్నతింటూ కూర్చున్న పిల్లలు. వాళ్ళెవ్వరూ తనని గమనించే వీల్లేకుండా కుర్చీ వేసుకూర్చుని తదేకంగా భార్యని చూస్తూ తన్మయుడయ్యాడు. భోజనాల తంతు పూర్తయ్యాక అరగంటపైగా గడిచింది.

కొత్తపెళ్ళికూతురిలా ముస్తాబైన జ్యోతి వయ్యారంగా కదుల్తూ భర్తను సమీపించింది అతని కోరిక ప్రకారం ముస్తాబు చేసుకుని' కావాలనే కాస్తంత మోతాదు పెంచి సరససల్లాపాలు కొనసాగించాలని నిర్ణయించుకున్న జ్యోతి కొంటెగా కన్ను గీటింది.

అసలే ఆమె అందానికి ముగ్ధుడై ఎప్పుడెప్పుడు దగ్గరకు తీసుకుందామా అని తహతహలాడ్తున్న దివాకర్, ఆమెకన్నుగీటటంతో మరింతగా రెచ్చగొట్టబడ్డాడు అచ్ఛాదనలేని మెడకింది భాగం అతడ్ని వివశుడ్నిచేస్తుండగా ఆమెను తనకేసి లాక్కుని కౌగిలించుకున్నాడు.

"అబ్బా .... ఉండండీ .... ఏమిటీ అల్లరి ఏదీ ఎరుగని కొత్త బిచ్చగాడిలా" అంది జ్యోతి.

ఆమె మాటలకు ఏమీ బదులివ్వకుండానే ఎత్తయిన గుండెలపై ముఖముంచాడు అతని ప్రతికదలికా ఆమెకు కొత్తగా అనిపించ సాగింది.

ఎన్నాళ్ళనుంచో ఎదురు చూస్తున్న అవకాశం వచ్చినట్లు, ఆ అవకాశాన్ని క్షణంకూడా వృధా చేసుకోవడం ఇష్టంలేనట్లు రెచ్చిపోయి తన చేతుల్తోనూ, పెదవుల్తోనూ ఆమెను నఖశిఖపర్యంతం స్పృశిస్తూ ఆ స్పర్శలోని సుఖాన్ని ఆసాంతం అనుభవిస్తూ తన్మయత్వంలో మునిగిపోయాడు దివాకర్.

అలాంటి ఏకాంతం దొరికి చాలాకాలం కావటంతో జ్యోతికి కూడా అదోరకం చెప్పలేనిహాయి కలిగింది మనసుకు, శరీరానికికూడా. ఓపలేని పులకింత, మాటలకందని పరవశం కలిగినై ఆమెక్కూడా.

తొలగిన పైటలోంచి కనిపిస్తున్న అందాల్నిచూస్తూ ఆ పైటను అలాగే పట్టుకున్న దివాకర్ "చోళీకే పీచే క్యాహై" వవ్వుతూ అడిగాడు

'ఊ.... జాకెట్' కళ్ళు పెద్దవిగాచేసి చెప్పింది జ్యోతి.

"ఇన్ కె పీఛే క్యాహై"

"అఁ....బ్రా"

"ఇస్ కె పీఛె ...."

"అనకూడాదూ" అన్నది గతంలో వచ్చిన టీ.వీ. కార్యక్రమం యాంకర్ మాదిరి.

"మరి" అన్నాడు విస్మయంగా.

"ఇస్ కె అందర్ క్యాహై అనాలి" అంది అతని బుగ్గమీద మమకారంగా నొక్కుతూ.

"యస్....ఇస్ కె అండర్ బందర్ ల" అంటున్న భర్తనోటిని తన పెదవుల్తో మూసేసింది జ్యోతి.

అధరామృతాన్ని తృప్తిగా గ్రోలి ఆమె పయ్యెదపై పవళించాడు కాసేపు. భర్త జుట్టులోకి చేతివేళ్ళని పోనిచ్చి లాలనగా నిమిరింది జ్యోతి.

మధ్యవయసులో ఆ ఆలుమగలిద్దరూ అనిర్వచనీయమైన మధురానుభూతికి లోనయ్యారు.

"జ్యోతీ ఎన్నిరోజులైందో నేను నీతో ఇలా ఏకాంతంగా, యథేచ్ఛగా గడిపి" అన్నాడు దివాకర్.

"అవునండీ మీరుగా ఆ విషయం ప్రస్తావిస్తే గానీ అర్థం చేసుకోలేకపోయాను. పొద్దస్తమానం ఇంటిపనితో గడిపి పాపం.... మీ గురించి....అదేలేండి ...'మీ గురించి' అంటే అలా అనికాదూ" అని వగలుబోయిన భార్యను మరోసారి బుగ్గపై గట్టిగా చుంబించాడతను.

"అవునుగాని ఇంతకీ నీ మాస్టర్‌ప్లానేంటో చెప్పనేలేదు" అన్నాడు ఆమె వీపుపైన పడుకుని.

"చెప్పనా" ఉడికింపుగా అన్నది భర్త ఒడిలో తల పెట్టుకుని పడుకున్న జ్యోతి.

"నువ్ చెప్తానన్నావనే గదా సమరంగానికి సంధించిన ఉత్తరం నీ చేతికి ఇచ్చింది" అన్నాడు దివాకర్.

"సరే అయితే .. ఆఫీసులో ఎలా మేనేజ్ చేస్తారో మీ ఇష్టం ఏరోజైనా ఉదయం పదకొండున్నరకు రాగలిగితే ఒంటిగంటవరకూ మీ ఇష్టం. ఆ టైములో పిల్లలింట్లో ఉండరు" అని అతని ఒడిలోంచి లేచింది.

"అంటే దేవిగారి అనుగ్రహం పొందాలంటే ఆఫీసులో పని పక్కన పెట్టి ఓ గంటపర్మిషన్ తీసుకుని ఇంటికి రావాలన్నమాట.... ఎప్పుడన్నా అయితే సరేగానే రోజూ పదకొండున్నరకి ఆఫీసునుంచి రావడం ఎలా కుదుర్తుందీ" అన్నాడు దివాకర్.

"అది మీ ఇష్టం" అంది జ్యోతి.

"ఏమిటో మనసైనప్పుడు, మనమకి కావాలనిపించినప్పుడు అర్థాంగిని అక్కున చేర్చుకునే రోజులుపోయి ఓ నిర్ణీత సమయానికి, తేలుకుట్టిన దొంగలా ఆఫీసు నుంచి పారిపోయి వచ్చి....ఏంటో ఈ కాల....కలికాలం...." నిరాశగా అన్నాడు దివాకర్.

"కలికాలం లేదు చలికాలం లేదు .. అదంతే.... వేళా పాళా అనేరోజులు మీ (మా) బామ్మలకాలం నాటివి. ఇప్పటి మమ్మీడాడీ లకు వేళాలేదు పాళాలేదు.

మన పిల్లలు పెద్ద చదువులు చదవాలన్నా, అమెరికా వెళ్ళి డాలర్లు సంపాదించుకు రావాలన్నా మనమిలా వేళకాని వేళల్లోనే వేడి చల్లార్చుకోవాలి"

జ్యోతిమాటలు వింటున్న దివాకర్ పెదవులపై మెరిసిన చిరు నవ్వులో వేదాంతధోరణి వ్యక్తమైంది.

—o—